31వ వసంతంలోకి
చురకలు
కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల
శనివారం 21 ఫిబ్రవరి 2026


# జీవన్ రెడ్డిని పరామర్శించిన మంత్రి అడ్లూరి

- ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్న మంత్రి



**చురకలు విలేకరి, ధర్మపురి,ఫిబ్రవరి 20 :** సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మాజీ మంత్రి జీవన్ రెడ్డి అస్వస్థతకు గురై సికింద్రాబాద్ లోని కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. జీవన్ రెడ్డి ఆనారోగ్యం విషయం తెలుసుకున్న రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమారుధవారం జగిత్యాల జిల్లా పర్యటనను వాయిదా వేసుకున్నారు. సికింద్రాబాద్ లోని కిమ్స్ ఆసుపత్రికి వెళ్లి జీవన్ రెడ్డిని పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మాజీ మంత్రి జీవన్ రెడ్డి త్వరగా కోలుకోవాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆకాంక్షించారు.

### మాజీ మంత్రి జీవన్ రెడ్డికి

# స్వల్ప అస్వస్థత

**-కిమ్స్ ఆసుపత్రిలో చేరిక**



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఫిబ్రవరి 20 :** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ మంత్రి టి. జీవన్ రెడ్డి స్వల్ప అస్వస్థత గురయ్యారు. గురువారం జీవన్ రెడ్డి.వాంతులు, వీరేచనాలతో స్వల్ప అస్వస్థతకు గురి కాగా కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం హైదరాబాద్ కిమ్స్ ఆసుపత్రికి తరలించినట్లు తెలుస్తోంది. ఆయన నీరసంగా ఉన్నప్పటికీ జగిత్యాల పట్టణంలో జరిగిన చత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలలో కూడా పాల్గొన్నారు. అయితే ఫుడ్ పాయిజన్ తో వచ్చిన అస్వస్థతకు సంబంధించి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ లోని కిమ్స్ లో చికిత్స పొందుతున్నట్లు తెలిసింది. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు తెలుస్తోంది.

**త్వరగా కోలుకోవాలని ప్రత్యేక ప్రార్థనలు..**

అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మాజీ మంత్రి జీవన్ రెడ్డి త్వరగా కోలుకోవాలని కోరుతూ శుక్రవారం జగిత్యాల పట్టణంలోని పలు మసీదుల్లో కాంగ్రెస్ పట్టణ మైనార్టీ అధ్యక్షులు ముకస్సర్ అలీ నేహాల్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

### విదేశీ ఉద్యోగాల పేరుతో

# యువతను మభ్య పెడితే కఠిన చర్యలు

- ఉద్యోగాల పేరుతో మోసం చేస్తున్న నలుగురి అరెస్టు
- నాలుగు సెల్ఫోన్లు, కీలకపత్రాలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ అశోక్‌కుమార్




**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఫిబ్రవరి 20 :** విదేశీ ఉద్యోగాల పేరుతో యువతను మభ్య పెడితే కఠిన చర్యలు తప్పవని, ఉద్యోగాల పేరుతో మోసం చేసిన నలుగురి అరెస్టు చేసి రిమాండ్కు తరలించామని జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. శుక్రవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విదేశీ ఉద్యోగాల పేరుతో యువతను మోసం చేసి లావోస్ దేశానికి అక్రమంగా తరలించిన ముఠాను అరెస్టు చేశామని, నిందితులు మల్లాపూర్ మంలంలోని ఓబులుపూర్ తండాకు చెందిన ఇస్లావత్ విజయేందర్, సారంగాపూర్ మండలంలోని పెంబట్లకు చెందిన మీసాల రాజశేఖర్, రంగపేటకు చెందిన దండుగుల కళ్యాణ్, ధర్మపురికి చెందిన శ్యామ్ రావు రాజశేఖర్లను అదుపులోకి తీసుకున్నామన్నారు. నిందితుడు విజయేందర్ 2024 నవంబర్లో లావోస్ వెళ్లి అక్కడి సైబర్ ఫ్రాడ్ నెట్వర్క్ లో చేరాడని, ప్రతి వ్యక్తిని లావోస్ కు రప్పిస్తే ఒక్కొక్కరికి 13వేల యువాన్లు కమిషన్ ఇస్తామని చెప్పడంతో జగిత్యాల, పరిసర ప్రాంతాల యువతను రిక్రూట్ చేయడం ప్రారంభించారని తెలిపారు. బ్యాంకాక్ కాల్ సెంటర్ ఉద్యోగం పేరుతో ఒక్కొక్కరి నుండి రూ.75 వేల నుండి రూ.1లక్ష 5వేల వరకు వసూలు చేసి, టూరిస్టు వీసాపై థాయిలాండ్కు రప్పించి అక్కడి నుండి ఏజెంట్ల ద్వారా సరిహద్దు అక్రమంగా దాటి లావోస్ దేశంలోని గోల్డెన్ ట్రయాంగిల్ ప్రాంతానికి తరలించేవారని తెలిపారు. అక్కడి చైనా కంపెనీల ఆధ్వర్యంలో నడుస్తున్న సైబర్ కాల్ సెంటర్లలో పని చేయమని బలవంతం చేశారని, అమెరికా ఇన్ఫ్లుయన్సర్ల పేర్లతో నకిలీ సోషల్ మీడియా ఖాతాలె సృష్టించి యూఎస్ఏలో నివసిస్తున్న భారతీయులను లక్ష్యంగా చేసుకొని ఆన్లైన్ మోసాలు చేయించేవారని తెలిపారు. పని చేయమని చెప్పిన వారికి పాస్పోర్టులు ఇవ్వకుండా బెదిరింపులకు పాల్పడేవారని, మోసపోయిన బాధితుని ఫిర్యాదు మేరకు జగిత్యాల రూరల్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి లుక్ అవుట్ నోటీస్ జారీ చేయగా, ఫిబ్రవరి 17న రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో నిందితుడు విజయేందర్ను అరెస్టు చేశామని, విచారణలో ముగ్గురు నిందితుల వివరాలు వెలుగులోకి రావడంతో వారిని కూడా అరెస్టు చేసి వారి వద్ద నుండి 4 సెల్ఫోన్లు, కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

### హోటల్ మేనేజ్మెంట్ కళాశాల

# జగిత్యాల యువతకు వరం

**జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్‌కుమార్**



**చురకలు విలేకరి, జగిత్యాల, ఫిబ్రవరి 20 :** హోటల్ మేనేజ్మెంట్ కళా శాల జగిత్యాల యువతకు వరమని జగి త్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో శక్తి ఇనిస్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్మెంట్ ఇనిస్టిట్యూట్‌ను శుక్రవారం జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్, మున్సి పల్ చైర్ పర్సన్ సమీండ్ల వాణి శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మె ల్యే డా. సంజయ్ కుమార్ మాట్లాడుతూ జగిత్యాల జిల్లా కేంద్రంగా యువతి యువకులకు శక్తి హోటల్ మేనేజ్ మెంట్ ఇన్స్టిట్యూట్‌ను ప్రారంభించడం అభినం దనీయమని, యువతి యువకులు సద్వినియోగం చేసుకొని ఉద్యోగావకా శాలు పొందాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా గ్రంథాల యం చైర్మన్ డా. గొల్లపెల్లి శేఖర్ గౌడ్, కళాశ్రీ గుండేటి రాజు, స్థానిక కౌన్సిలర్ నాగరాజు, కరభూజ ధర్మేంద్ర గౌడ్, ఇన్స్టిట్యూట్ కరస్పాండెంట్ ఏనుగంటి సందీప్ గౌడ్, పంజాల తిరుపతి గౌడ్, బుర్ర శ్రీధర్ గౌడ్, సిద్దు తదితరులు పాల్గొన్నారు.

### ఆర్థిక పునరావస సహాయానికి

# దివ్యాంగులకు ఇంటర్వ్యూలు

**ఐడీఓసీలో నిర్వహించిన ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్**



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డి పేట ఫిబ్రవరి 20 :** ఆర్థిక పునరావాస సహాయ పథకానికి సంబంధించి జిల్లాలోని ఆయా మండలాల నుంచి దరఖాస్తు చేసుకున్న దివ్యాంగులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. దివ్యాంగుల ఆర్థిక సహాయ పునరావాస పథకం కింద జిల్లాకు 14 యూనిట్లు మంజూరు కాగా ఒక్కో యూనిట్ విలువ రూపాయలు 50,000 వేలు. 100% రాయితీ ఉంటుంది. జిల్లాలోని ఆయా మండలాలకు చెందిన 38 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం(ఐడీఓసీ)లో శుక్రవారం దివ్యాంగులకు ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. 37 మంది దివ్యాంగులు హాజరుకాగా, వారికి సంబంధించిన సర్టిఫికెట్లు, అర్హతలు పరిశీలించి వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఇంటర్వ్యూలో డీఆర్డీఓ గీత, డీడబ్ల్యూఓ లక్ష్మీరాజం, ఎస్సీ కార్పొరేషన్ అధికారి స్వప్న, ఏవో మెప్మా మీర్జా ఫసహత్ అలీ బేగ్ ఉన్నారు.

# ఫిబ్రవరి 21...శాంతి స్వరూప్ భట్నాగర్ జయంతి

శాంతి స్వరూప్ భట్నాగర్ (ఫిబ్రవరి 21, 1894 జనవరి 1, 1955) గురించి తెలియని వారుండరు. భారతదేశం గర్వించదగ్గ శాస్త్రజ్ఞుడు భట్నాగర్. భట్నాగర్ ను భారత పరిశోధన శాలల పితామహుడిగా అభివర్ణిస్తారు. కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ (జూ×=) ప్రథమ డైరెక్టర్. యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ (ఖ+జ) తొలి మొదటి ఛైర్మన్. దేశంలో మొత్తం 12 పరిశోధన శాలలను ఆయన స్థాపించాడు. ఆయన జ్ఞాపకార్థం భారత ప్రభుత్వం శాంతి స్వరూప్ భట్నాగర్ పురస్కారం స్థాపించింది. శాంతి స్వ రూప్ భట్నాగర్ బ్రిటిష్ ఇండియా లోని పంజాబ్ ప్రాంతంలోని, ఇప్పటి పాకిస్తాన్లో ఉన్న షాపూర్లో, హిందూ కాయస్థ కుటుంబంలో 1894 ఫిబ్రవ రి 21న భట్నాగర్ జన్మించాడు. చిన్ననాటి నుండి సాహిత్యమన్నా, విజ్ఞాన శాస్త్రమన్నా విపరీతమైన ఆసక్తిని పెంచు కున్నాడు. కవిత్వం లో మంచి ప్రవేశ ముండేది. బాల్యం నుండే బొమ్మలు, యంత్ర పరికరా లు చేయటంలో ఆసక్తి కనబరిచే వాడు. తన ప్రాథమిక విద్యను దయానంద్ ఆంగ్లో-వేద ఉన్నత పాఠశాల, సికింద్రా బాద్ (బులంద్ షహర్ ) నుండి పూర్తి చేశాడు. 1911లో లాహోర్ లోని కొత్తగా స్థాపించ బడిన దయాల్ సింగ్ కాలేజీలో చేరాడు. భట్నాగర్ 1913లో పంజాబ్ విశ్వ విద్యాలయం ఇంటర్మీడియట్ పరీక్షలో ఉత్తీర్ణుడ య్యాడు. ఫోర్మాన్ క్రిస్టియన్ కళాశాలలో చేరాడు. 1916లో భౌతిక శాస్త్రంలో గ్రాడ్యుయేషన్, పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేశాడు. విదే శాల్లో చదువుకోవడానికి దయాళ్ సింగ్ కాలేజ్ ట్రస్ట్ ద్వారా స్కాలర్ షిప్ పొంది, యూనివర్సిటీ కాలేజ్ లండన్లో 1921 లో సైన్స్లో డాక్టరే ట్ పొందాడు. భారతదేశానికి తిరిగి వచ్చి, కొత్తగా స్థాపించ బడిన బనా రస్ హిందూ విశ్వవిద్యాలయం లో రసాయన శాస్త్ర ప్రొఫెసర్గా చేరా డు. తర్వాత విశ్వ విద్యాలయం లోని ఫిజికల్ కెమిస్ట్రీ ప్రొఫెసర్, యూనివర్సిటీ కెమికల్ లాబొరే టరీస్ డైరెక్టర్గా లాహోర్కు మారాడు. మాగ్నెటోకెమిస్ట్రీ, ఫిజిక ల్ కెమిస్ట్రీ ఆఫ్ ఎమల్షన్ రంగాలలో పరిశోధనతో పాటు, అప్లైడ్ కెమిస్ట్రీ లో కూడా గణనీయమైన కృషి చేసాడు. రావల్పిండి ప్రాంతంలో ఒక బ్రిటిష్ కంపెనీ చమురు అన్వేషణా కార్యక్రమం చేపట్టిన రోజుల్లో ఒక సమస్య ఎదురైంది. చమురు ఉన్న ప్రాంతం బురదమయంగా ఉండేది. పైగా డ్రిల్ చేసిన బురద ఉప్పు నీటితో కలిసి గట్టిగా రాయిలాగా మారి, డ్రిల్లింగ్ కు అంతరాయం కలిగించేది. ఒక దశలో పనిపూర్తిగా ఆగిపోయేది. అపుడు కంపెనీవారు భట్నాగర్ ను సలహా కోరారు. భట్నాగర్ ఈ సమస్యను కూలం కషంగా పరిశీలించి అతిసులభ మైన, చవకైన పరిష్కారాన్ని సూచించాడు. డ్రిల్ చేసిన బురదకు జిగురు కలపమని



సలహా ఇచ్చా డు. జిగురు కలిపిన బురదకు స్నిగ్ధత తక్కువై గట్టిపడకుండా ఉండటంతో బ్రిటీష్ కంపెనీ కొన్ని లక్షల రూపాయల నష్టం నుండి బయట పడింది. వెంటనే కంపెనీ వారు ఆయనకు లక్షాయాభై వేల రూపాయలు బహుకరించారు. ఆ సొమ్మును లాహోరు యూనివర్శిటీకి చమురు పరిశోధనల కోసం విరాళంగా ఇచ్చాడు. భట్నాగర్ చమురు పరిశోధనా భివృద్ధికి ఎంతో కృషి చేశాడు. మైనాన్ని వాసన లేకుండా ఎలా రూపొందించాలో ఆయన తెలియ చేశాడు. కిరోసిన్ ను శుద్ధి చేయ డం, వెలుగును ఎక్కువ చేయటం, ఆదా చేయడం గురించి భట్నాగర్ విలువైన సమాచారాన్ని అందించా డు. పెట్రోలియం నుండి విడుదల య్యే వ్యర్థ పదార్థాలను చమురు పరిశ్రమలో ఎలా ఉపయోగించాలో పరిశోధించాడు. ఆయన జూ×= కు డైరెక్టరయ్యాడు. వ్యర్థ పదార్థాల నుండి ప్లాస్టిక్స్ చేయడం, రబ్బరు వస్తువులను రూపొందించడం వంటి పరిశోధనలను ముమ్మరం చేశాడు. కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ స్వయం ప్రతిపత్తి సంస్థగా, 28 సెప్టెంబర్ 1942న అమలులోకి వచ్చింది. 1943లో ఆయనను ఫెలో ఆఫ్ రాయల్ సొసైటీ (ఖీ=ూ) గా ఎన్ను కున్నారు. శాంతి స్వరూప్ భట్నాగర్... హోమీ జహంగీర్ భాభా, ప్రశాంత చంద్ర మహలనోబిస్, విక్రమ్ సారాభాయ్ తదితరులతో పాటు భారతదేశ స్వాతంత్ర్యానంతర శాస్త్ర సాంకేతి క మౌలిక సదుపాయాలు, విధానా ల నిర్మాణంలో గణనీయమైన పాత్ర పోషించాడు. విద్యా మంత్రిత్వ శాఖ కార్యదర్శిగా మరియు ప్రభుత్వ విద్యా సలహాదారుగా కూడా పని చేశాడు. నేషనల్ రీసెర్చ్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ (చీ=ణఉ) ఆఫ్ ఇండియా స్థాపనలో అతను కీలక పాత్ర పోషించి, దేశంలో ఇండస్ట్రి యల్ రీసెర్చ్ అసోసియేషన్ ఉద్యమానికి నాంది పలికాడు. భట్నాగర్ భారత దేశములో వివిధ ప్రాంతాలలో...సెంట్రల్ ఫుడ్ ప్రాసెసింగ్ టెక్నలాజికల్ ఇన్స్టిట్యూట్ మైసూర్ , నేషనల్ కెమికల్ లాబొరేటరీ పూణే , నేషనల్ ఫిజికల్ లాబొరేటరీ న్యూఢిల్లీ , నేషనల్ మెటలర్జికల్ లాబొరేటరీ జంషెడ్పూర్ , సెంట్రల్ ఫ్యూయల్ ఇన్స్టిట్యూట్ ధన్బాద్ వంటి మొత్తం 12 జాతీయ ప్రయోగ శాలలను స్థాపించాడు. నెహ్రూ హయాంలో ప్రభుత్వం నుండి నిధులను సమకూర్చి చమురు పరిశోధనా వనరులను అభివృద్ధి చేశాడు. దేశంలో చమురు వనరు లు, చమురు నిక్షేప స్థావరాలు, అణుఖనిజ పరిశ్రమలు అభివృద్ధి చెందాయంటే అది భట్నాగర్ కృషే ప్రధాన కారణం. భట్నాగర్ 1955 జనవరి 1వ తేదీన మరణించాడు. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో శాస్త్ర వేత్తలు కనబరిచిన ప్రతిభకు నిదర్శనంగా, ఆయా రంగాలకు వారు అందించిన సేవలకు గుర్తింపు గా ప్రతి ఏటా ఇచ్చే శాంతి స్వరూప్ భట్నాగర్ అవార్డులు భారత శాస్త్ర రంగంలో అత్యున్నతమైనదిగా పరిగణిస్తారు. ఈ పురస్కారం మొదటి సారి 1958 లో యివ్వబడి నది. 45 సంవత్సరాల వయసు వరకు, శాస్త్ర మరియు సాంకేతిక రంగాలలో పరిశోధన చేస్తూ ఉంటే ఈ పురస్కారానికి అర్హత పొందు తాడు. ఈ పురస్కారం ఒక పతకం, నగదు బహుమతి 5 లక్షలు అందజేయ బడుతుంది. అదనంగా ఆ పురస్కార గ్రహీత 65 వ సంవత్సరం వరకు ప్రతీ నెలా రూ. 15,000 అందజేయ బడుతుంది.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...
9440595494

..............................

# అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం..!!

అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం మనకు ఈ బాధ్యతను గుర్తు చేసే ఒక ముఖ్యమైన రోజు. అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 21 న ప్రపంచవ్యాప్తంగా నిర్వహించాలని 1999 నవంబరు 17 న యునెస్కో ప్రకటించింది. 2000 సంవత్సరం నుంచి ప్రతి ఏటా మాతృభాషా పరిరక్షణ కార్యక్రమాన్ని యునెస్కో డైరెక్టర్ జనరల్ ప్రకటిస్తూ వస్తున్నారు. ప్రపంచంలో చిన్న, పెద్ద భాషలన్నిటినీ రక్షించుకోవాలని, భాషా సాంస్కృతిక వైవిధ్యాన్ని కాపాడుకోవడం ద్వారానే మనం జీవ వైవిధ్యాన్ని కాపాడు కోగలమని యునెస్కో చెబుతోంది. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 21 న ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటారు. భాషల ప్రాముఖ్యతను గుర్తు చేయడం, మాతృ భాషల పరిరక్షణకు అవగాహన కల్పించడం మరియు భాషా వైవిధ్యాన్ని గౌరవించడం ఈ దినోత్సవం ముఖ్య ఉద్దేశ్యం. ఈ దినోత్సవాన్ని ఖచీజుూజూ 1999లో ప్రకటించింది. పాకిస్థాన్ ఏర్పాటుకు ముందు పరిస్థితి 1947లో భారతదేశ విభజన తర్వాత పాకిస్థాన్ రెండు భౌగోళిక భాగాలుగా ఏర్పడింది. తూర్పు పాకిస్థాన్ ప్రస్తుతం బంగ్లాదేశ్




పడమటి పాకిస్థాన్ ప్రస్తుతం పాకిస్థాన్ ఈ రెండు ప్రాంతాలు భౌగోళికంగా వేరు కాగా, భాష, సంస్కృతి పరంగా కూడా ఎంతో భిన్నంగా ఉన్నాయి. తూర్పు పాకిస్థాన్ ప్రజలు బంగ్లాను ప్రధాన భాషగా ఉపయోగించగా, పడమటి పాకిస్థాన్ ప్రజలు ఉర్దూ, పంజాబీ భాషలను ఎక్కువగా ఉపయోగించేవారు. భాషా ఉద్యమం 1948 నుంచి 1952 వరకు 1948లో, పాకిస్థాన్ ప్రభుత్వం ఉర్దూనే దేశపు ఏకైక జాతీయ భాషగా ప్రకటించింది. అయితే తూర్పు పాకిస్థాన్ జనాభాలో అధిక శాతం బంగ్లా మాట్లాడేవారే. దీంతో తూర్పు పాకిస్థాన్ ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించారు. 1948 ఫిబ్రవరి 23 న తూర్పు పాకిస్థాన్కు చెందిన ధీరేంద్రనాథ్ దత్తా, పాకిస్థాన్ రాజ్యాంగ సభలో బంగ్లాను కూడా జాతీయ భాషగా గుర్తించాలని ప్రస్తావించారు. కానీ ఈ ప్రతిపాదనను ప్రభుత్వం తిరస్కరించింది. 1952లో భాషా ఉద్యమం ఉధృతమైంది. ఫిబ్రవరి 21 న, ఢాకా విశ్వవిద్యాలయ విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. పోలీస్ కాల్పుల వల్ల కొంతమంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారు. వారి త్యాగాన్ని స్మరించుకుంటూ భాషా హక్కుల ప్రాముఖ్యతను ప్రపంచానికి తెలియజేయడానికి ఈ దినోత్సవాన్ని 2000 రెండు వేల సంవత్సరం నుండి అధికారికంగా ఏర్పాటు చేశారు. భాష కోసం చేసిన ఆ త్యాగం ప్రపంచ చరిత్రలో ఒక ముఖ్య ఘట్టంగా నిలిచింది. 1998లో కెనడాలో నివసిస్తున్న బంగ్లాదేశీ రఫీకుల్ ఇస్లాం, అబ్దుస్ సలాం అనే ఇద్దరు వ్యక్తులు భాషల పరిరక్షణ కోసం ప్రత్యేకమైన రోజు ఉండాలనే" ప్రతిపాదనను ఐక్యరాజ్యసమితికి పంపారు. 1952 ఫిబ్రవరి 21 జరిగిన భాషా ఉద్యమాన్ని గుర్తుచేసేందుకు ఈ తేదినే అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవంగా ప్రకటించాలని సూచించారు. బంగ్లాదేశ్ ప్రభుత్వం యునెస్కోలో ఈ ప్రతిపాదనను ప్రవేశపెట్టగా, అప్పటి ప్రధాన మంత్రి శేఖ్ హసీనా ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. 1999 నవంబరు 17 న యునెస్కో 30 వ జనరల్ అసెంబ్లీ లో ఫిబ్రవరి 21 ను అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవంగా గుర్తించాలని ఏకగ్రీవంగా తీర్మానించబడింది. మాతృభాష మనకు మొదటగా నేర్చుకునే భాష. తల్లి ద్వారా మనకు అందే భాష కావడంతో దానిని మాతృభాష అంటారు. మన ఆలోచనలు, భావాలు, సంస్కృతి, సంప్రదాయాలు అన్నీ మాతృభాష ద్వారానే వ్యక్తమవుతాయి. ఒక వ్యక్తి వ్యక్తిత్వ వికాసంలో మాతృభాష కీలక పాత్ర పోషిస్తుంది. చిన్నప్పటి నుంచే పిల్లలు తమ మాతృభాషలో విద్యను అభ్యసిస్తే వారి అర్థం చేసుకునే సామర్థ్యం, ఆలోచనా శక్తి, సృజనాత్మకత మరింత పెరుగుతుంది. ప్రపంచంలో వేలాది భాషలు ఉన్నాయి. ప్రతి భాషకు ప్రత్యేకత, చరిత్ర, సాహిత్యం మరియు సంస్కృతి ఉంది. అయితే ఆధునికీకరణ, గ్లోబలైజేషన్ ప్రభావం వల్ల కొన్ని చిన్న భాషలు అంతరించిపోతున్నయి, భాషలు కనుమరుగైతే ఆ భాషతో పాటు ఒక సంస్కృతి కూడా నశిస్తుంది. అందుకే భాషలను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత. ఇంట్లో, పాఠశాలలో, సమాజంలో మాతృభాషను ప్రోత్సహించాలి. భారతదేశం భాషా వైవిధ్యానికి నిలయంగా ఉంది. ఇక్కడ వందలాది భాషలు, ఉపభాషలు మాట్లాడబడుతున్నాయి. మన తెలుగు భాషకు గొప్ప చరిత్ర, సాహిత్య సంపద ఉంది. నన్నయ్య, తిక్కన, ఎర్రప్రగడ వంటి కవుల రచనలు తెలుగు భాష మహిమను ప్రపంచానికి చాటాయి. మన మాతృభాషను గౌరవించడం అంటే మన సంస్కృతిని గౌరవించడం వంటిదే. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా పాఠశాలలు, కళాశాలలు, వివిధ సంస్థలు సాహిత్య కార్యక్రమాలు, వ్యాసరచన, కవితా పఠనం, వక్తృత్వ పోటీలు నిర్వహిస్తాయి. భాషల ప్రాముఖ్యతపై చర్చలు, సదస్సులు జరుగుతాయి. ఈ కార్యక్రమాలు యువతలో భాష పట్ల ప్రేమను పెంపొందిస్తాయి. చివరగా మాతృభాష మన అస్థిత్వానికి మూలాధారం. భాషను కాపాడడం అంటే మన సంస్కృతిని, మన సంప్రదాయాలను కాపాడడమే. ప్రతి ఒక్కరూ తమ మాతృభాషను ప్రేమించి, గౌరవించి, తదుపరి తరాలకు అందించాలని కోరుతున్నాము.

# నేల మట్టి ఆరోగ్య సంరక్షణ అవగాహన కార్యక్రమం

**చురకలు ప్రతినిధి కోరుట్ల ఫిబ్రవరి 20 :** నేల మట్టి ఆరోగ్య సంరక్షణ సాయిల్ హెల్త్ మేనేజ్‌మెంట్ మట్టి నమూనా పరీక్షలపై కల్లూరు మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు శిక్షణ మరియు అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు.కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నాగమణి విద్యార్థులకు ప్రస్తుత పరిస్థితుల్లో నేలల సారం వాటి ఆరోగ్య పరిరక్షణ యాజమాన్య ప్రాముఖ్యతను వివరించారు కోరుట్ల మండలంలోని రైతులు నేల ఆరోగ్యాన్ని ఎలా కాపాడుకుంటున్నారో సేంద్రియ మరియు సహజ వ్యవసాయం ద్వారా



నేల నాణ్యత ఎలా మెరుగుపడుతుందో వివరించారు.అలాగే రసాయన ఎరువుల వాడకం వల్ల నేలలో జరిగే మార్పులను వివరిస్తూ విద్యార్థులు ఇప్పటి నుంచే నేల ఆరోగ్యం ఎరువుల వినియోగంపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు మట్టి నమూనా పరీక్షలను ఎలా నిర్వహిస్తారో తెలియజేసి వాటి ప్రాముఖ్యతను వివరించారు ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ



అధికారి నాగమణి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ మోహన్ ఇతర ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వంతో పేదల సొంతింటి కల సాధ్యమవుతుంది

**-జగిత్యాల ఎమ్మెల్యే డా.యం.సంజయ్ కుమార్**

**చురకలు విలేకరి, బీర్ పూర్ ఫిబ్రవరి 20 :** కాంగ్రెస్ ప్రభుత్వంతో పేదలసొంతింటి కల సాధ్యమవుతుందని జగిత్యాల ఎమ్మెల్యే డా.యం.సంజయ్ కుమార్ అన్నారు.బీర్‌పూర్ మండలం లోని నాయకగూడెం సర్పంచ్ కొత్తూరి పుష్పనాథ్కు మంజూరైన ఇందిరమ్మ ఇళ్లు ఇటీవలే పూర్తి కాగా శుక్రవారం



గృహప్రవేశం కార్యక్రమానికి జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్, డిసిసి అధ్యక్షుడు గాజెంగి నందయ్యలు హజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంతో పేదల సొంతింటి కల సాధ్యమవు తుందని,రెండవ విడతలో సైతం అర్హులందరికీ ఇండ్లు మంజూరు చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు గుర్రాల రాజేందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ రాజేశ్వరీ,మాజీ ఉపసర్పంచ్ ఏలూరి గంగారెడ్డి, రవీందర్,మోహన్ రెడ్డి,గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మార్చి 01 వరకు సంక్షేమ పథకాల కోసం దరఖాస్తు చేసుకోవాలి

**-జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి పి.నరేష్ కుమార్ నాయుడు**

**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ (పెద్దపల్లి) ఫిబ్రవరి 20 :** మైనారిటీ శాఖ ద్వారా అమలు చేసే వివిధ సంక్షేమ పథకాలకు అర్హులైన మైనారిటీ అభ్యర్థులు మార్చి 1 నాటికి ఆన్లైన్లో తమ దరఖాస్తులు సమర్పించాలని జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి పి.నరేష్ కుమార్ నాయుడులి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా మైనారిటీల సంక్షేమం కోసం 2025-26 సంవత్సరంలో ఆర్థిక సహాయ కింద నిరుద్యోగ మైనారిటీ (ముస్లిం, సిక్కు, బౌద్ధ, జైన మరియు పార్సి) యువత (పురుషులు) సాధికారత కోసం ఇ-స్కూటర్లు పంపిణీ చేయుటకు స్వయం ఉపాధిని అందించడానికి తెలంగాణ ప్రభుత్వం పైలట్ ప్రాజెక్ట్ ప్రారంభించిందని అన్నారు.పైలెట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేసిన మైనారిటీ నిరుద్యోగ యువత (పురుషుల) కు తెలంగాణ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా లక్షా 50 వెల రూపాయల విలువగల ఈ-స్కూటర్ 80% సబ్సిడీతో అందిస్తామని అన్నారు. మైనార్టీ వర్గానికి చెందిన అభ్యర్థులు తమ ఆధార్ కార్డు, రేషన్ కార్డుతో మార్చ్ 1 లోగా దరఖాస్తు చేసుకోవాలని, వీరికి 21 నుంచి 40 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండాలని,అభ్యర్థి 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని,కుటుంబంలో ఒకరికి మాత్రమే పథకం అందుతుందని,అభ్యర్థికి ఆర్టిఏ జారీ చేసిన డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలని, ఉబర్ / రాపిడో / ఓలా, ఇతర సర్వీస్ ప్రొవైడర్లతో క్రమం తప్పకుండా పనిచేస్తానని దరఖాస్తుదారు స్వీయ ప్రకటన కలిగి ఉండాలని, దరఖాస్తుదారుడి వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాలకు రూ. 1.5 లక్షలు మరియు పట్టణ ప్రాంతాలకు రూ. 2 లక్షలు మించకూడదని, ఈ-స్కూటర్ తెలంగాణ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ హామీ కింద ఉండాలని అన్నారు.గత ఐదు సంవత్సరాలలో తెలంగాణ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ యొక్క ఏ పథకం నుండి తాను ప్రయోజనం పొందలేదని దరఖాస్తుదారు స్వీయ ప్రకటన, డ్రైవింగ్ లైసెన్స్ పై ఎటువంటి కేసు ఉండకూడదని తెలిపారు.ముస్లిం తుర్క కాష పథకమునకు సంబంధించి జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి, పెద్దపల్లి వివరిస్తూ ఈ పథకము క్రింద అర్హత కలిగిన ఎంపిక అయిన అభ్యర్థులకు ఉచిత టూల్ కిట్లు, జనరేటర్స్ అందిస్తామని,ఈ పథకము వల్ల లబ్ధి పొందాలంటే అభ్యర్థి తుర్క కాష ముస్లిం అయి ఉండాలి,(ఆధార్ కార్డు/ రేషన్ కార్డు అభ్యర్థి చిరునామా కొరకు సమర్పించాలి), అభ్యర్థి వయస్సు 21 నుంచి 55 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండాలి (వోటర్ ఐడి./ఆధార్ కార్డు/ ఎఫ్ఎస్ సి వయస్సు ధృవీకరణ కొరకు సమర్పించవలెను), తుర్క కాష కమ్యూనిటీ అసోసియేషన్ ద్వారా జారీ చేయబడిన తుర్క కాష కమ్యూనిటీ ఉండవలెను, గత ఐదు సంవత్సరాలలో తెలంగాణ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ యొక్క ఏ పథకం నుండి తాను ప్రయోజనం పొందలేదని దరఖాస్తుదారు స్వీయ ప్రకటన ఇవ్వవలెను మరియు అభ్యర్థి తుర్క కాష కమ్యూనిటీకి చెందిన వాడని స్వయం ప్రకటన ఇవ్వాలని తెలిపారు.ఈ రెండు పథకాలకు సంబంధించిన దరఖాస్తుల ను 01.03.2026 నాటికి కార్పొరేషన్ పోర్టల్https://tgobmms.cgg.gov.in/ లో నమోదు చేసుకోవాలని, ముఖ్యమైన పత్రాలను ఆన్. లైన్ దరఖాస్తుతో పాటు సంబంధిత ఎంపిడిఓ/ మున్సిపల్ కమిషనర్ కార్యాలయములో సమర్పించాలని కావున అర్హత కలిగిన మైనారిటీలు ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మరిన్ని వివరాల కోసం జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి కార్యాలయము,రూమ్ నెం.232,ఫస్ట్ ఫ్లోర్,ఐడిఓసి, పెద్దపల్లి నందు సంప్రదించగలరు.జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## ఇందిరమ్మ ఇల్లు నూతన గృహప్రవేశం





**చురకలు ప్రతినిధి కోరుట్ల ఫిబ్రవరి 20 :** శుక్రవారం కాంగ్రెస్ ప్రభుత్వం ఇల్లు లేని నిరుపేదలకు అందిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా 16వ వార్డులో మంజూరై నిర్మాణం పూర్తయిన ఇంటికి నూతన గృహప్రవేశ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు జువ్వాడి కృష్ణారావు కార్యక్రమానికి హాజరై రిబ్బన్ కట్‌చేసి గృహప్రవేశాన్ని ప్రారంభించారు అనంతరం లబ్ధిదారులకు నూతన వస్త్రాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో 16వ వార్డు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బలిజ రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ చైర్మన్ లింబద్రికి సన్మాణం



**చురకలు ప్రతినిధి మెట్‌పల్లి ఫిబ్రవరి 20 :** జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మున్సిపల్ చైర్మన్ గా ఎన్నికైన మైలారపు లింబద్రి నీ శుక్రవారం ఇబ్రహింపట్నం మండలం యామపూర్ సహకారసంఘ మాజీ చైర్మన్ అంకతి రాజన్న ,విండో మాజీ డైరెక్టర్ గుజ్జె గంగాధర్‌లు శాలువలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో బుర్రి లక్ష్మీ నారయణ తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేద విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ



**చురకలు విలేకరి, ధర్మపురి, ఫిబ్రవరి 20 :** ధర్మపురి మండలం లోని గోవిందుల పల్లి గ్రామానికి చెందిన ముగ్గురు నిరుపేద విద్యార్థులకు జగిత్యాల డిఎస్పీ రఘు చందర్ శుక్రవారం దేవస్థానం ఈవో శ్రీనివాస్, పోలీస్ అధికారులతో కలిసి సైకిళ్లను పంపిణీ చేశారు. గోవిందుల పల్లి గ్రామానికి చెందిన ఎస్. పవన్ కుమార్, ఎల్ . విష్ణువర్ధన్, జి అవంతిక లు నేరెళ్ల గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ ప్రతిరోజు నడుచుకుంటూ వెళు తున్నారు. ఇటీవల ఓ సామాజిక కార్యక్రమానికి డిఎస్పీతో పాటు దేవస్థానం ఈవో, స్థానిక పోలీసు అధికారులు హాజరయ్యారు. సదరు పేద విద్యార్థుల పరిస్థితిని వీరు తెలుసుకొని, డీఎస్పీ ఆధ్వర్యంలో ఇరువురు విద్యార్థులకు, దేవస్థానం ఈవో శ్రీనివాస్ పక్షాన ఓ విద్యార్థికి సైకిళ్లను బహుకరిస్తామని హామీ ఇచ్చారు. స్థానిక పోలీస్ స్టేషన్ శుక్రవారం వాటిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయి చేరాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సీఐ రాం నర్సింహరెడ్డి, ఎస్ఐలు మహేష్, రవీందర్ కుమార్ పాల్గొన్నారు.

# సిపిఎస్ ఉద్యోగుల డీఏ బకాయిలను వెంటనే చెల్లించాలి



**చురకలు విలేకరి, ధర్మపురి, ఫిబ్రవరి 20 :** తెలంగాణ రాష్ట్ర సీపీఎస్ ఉద్యోగులకు రావాల్సిన డిఏ వాయిదాల బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని తెలంగాణ స్టేట్ కాంట్రిబ్యూటరీ పెన్షన్స్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు శుక్రవారం ధర్మపురి మండలంలోని దొంతపూర్ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పాఠశాల సముదాయ సమావేశం లో నిరసన తెలిపి మండల విద్యాధికారి ఎస్ సీత లక్ష్మి కి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మ్యాన పవన్ కుమార్ మాట్లాడుతూ సిపిఎస్ ఉద్యోగులకు రావాల్సిన డీఏలను వాయిదాల రూపంలో చెల్లించడం బాధాకరమని, ప్రభుత్వం సకాలంలో వీటిని చెల్లించకుండా వాయిదాల సంఖ్యను పెంచుకుంటూ పోవడం వల్ల వాయిదాల ద్వారా రావలసిన మొత్తం సుమారు 1200 కోట్లకు చేరడం వల్ల ఉద్యోగ, ఉపాధ్యాయులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రతి నెల విడుదల చేస్తున్న 700 కోట్ల నిధులలో భాగంగా ఫిబ్రవరి నెల తప్పనిసరిగా సీపీఎస్ బకాయిల కోసం కేటాయించాలని కోరారు. అలాగే గత ఎన్నికల హామీ మేరకు ప్రభుత్వం వెంటనే స్పందించి తెలంగాణలో పాత పెన్షన్ విధానాన్ని (ఓపిఎస్ ) అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొమ్మినేని ప్రభాకర్ టిఎస్ సిపిఎస్ఈయు నాయకులు సందుపట్ల రమేష్, సందరికారి రాజేష్,బండారి రాజు, బైరి మల్లేష్, మోటూరి నరేష్, చంద్ర కళ, రజిత, సిందుజ, సునీత, సీనియర్ ఉపాధ్యాయ సంఘ నాయకులు దాసరి భీమయ్య, బుగ్గారాపు హరీష్, పులి రమేష్,అసం శ్రీనివాస్, సాదు శ్రీకాంత్, మెరుగు రమేష్, వొజ్జల మహేష్,బండి ప్రవీణ్- తదితరులు పాల్గొన్నారు.

## మాట నిలుపుకున్న ధర్మపురి కౌన్సిలర్



**చురకలు విలేకరి,ధర్మపురి,ఫిబ్రవరి 20 :** ఇటీవల ధర్మపురి మున్సిపల్ ఎన్నికల్లో ప్రచారం లో భాగంగా 13 వార్డు కౌన్సిలర్ గా గెలిపిస్తే వార్డులోని ప్రతి ఆడబిడ్డ కల్యాణానికి మేనమామ కట్నంగా 5016 రూపాయలు ఇస్తానని హామీ ఇచ్చి ఆ హామీని వార్డు కౌన్సిలర్ చిపిరిశెట్టి రాజేష్ శుక్రవారం నిలుపుకున్నారు. శుక్రవారం ధర్మపురి పట్టణంలోని ఎస్ హెచ్ గార్డెన్ లో 13వ వార్డుకు చెందిన లింగం హర్షిణీ జరిగింది. వివాహానికి హాజరై 5016 రూపాయలు కుటుంబ సభ్యులకు అందజేశారు. ఇచ్చిన హామీని నిలుపుకున్న రాజేష్ ను పలువురు అభినందించారు.

# ఆస్థి కోసం సహోదరునిపై హత్య ప్రయత్నం చేసిన అన్న

**-తెల్లవారుజామున కత్తితో దాడి ...ముగ్గురికి తీవ్ర గాయాలు**

**-నిందితున్ని అరెస్ట్ చేసిన గోదావరిఖని వన్ టౌన్ పోలీసులు**






**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ (గోదావరిఖని) ఫిబ్రవరి 20 :** గోదావరిఖని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధి మార్కండేయ కాలనీలో రెండు కుటుంబాల మధ్య ఆస్థి, ఇతర వివాదాల కారణంతో కత్తి తో దాడి చేసి హత్యాయత్నంకి పాల్పడిన నిందితుని అరెస్ట్ వివరాలు ఏసీపీ గారి కార్యాలయంలో గోదావరిఖని ఏసిపి మడత రమేష్,గోదావరిఖని వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేన రెడ్డి కలిసి అరెస్ట్ వివరాలు వెల్లడించారు.

**నిందితుని వివరాలు :** గాడిచెర్ల రామ్ దూత్, తండ్రి సారయ్య, (28)నివాసం మార్కండేయ కాలనీ, గోదావరిఖని చెందినవాడు అని పేర్కొన్నారు. నిందితుడు దాడికి ఉపయోగించిన కత్తి,01 మొబైల్ ఫోన్,రక్తపు మరకలు ఉన్న బట్టలు స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ తెలిపారు.

**వివరాల్లోకి వెళితే...**

నిందితుడు గాడిచెర్ల రామ్ దూత్, బిటెక్ చదివి ప్రస్తుతం సోరియాసిస్ చర్మ వ్యాధితో ఇంట్లోనే ఉంటున్నాడు. నిందితుని తాత రాయమల్లు కట్టించిన ఇంటిలో పెద్ద కుమారుడు సారయ్య కుటుంబం ఒక భాగంలో ఉండగా, చిన్న కుమారుడు శ్రీనివాస్ కుటుంబం మరో భాగంలో ఇద్దరు కుమారుల పక్కపక్కనే చెరో భాగంలో నివసిస్తున్నారు. శ్రీనివాస్ పదకొండు నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన భార్య సుమిత్రి, కుమారుడు ప్రణయ్ (22), కుమార్తె సువర్చలా, సుమిత్రి తల్లి కొమురమ్మ అక్కడే ఉంటున్నారు.నిందితుడు రామ్ దూత్ తండ్రికి ఫిట్స్, బీపీ సమస్యలు ఉండగా, తల్లికి గుండె సమస్యలు ఉన్నాయి. పిన్ని సుమిత్ర కిరాణా దుకాణంలో సిగరెట్లు, గుట్కా, పాన్ మసాలా అమ్ముతుండగా, వాటి వాసన మరియు సిగరేటు అక్కడే త్రాగడం వల్ల వచ్చే పొగ కారణంగా తమ ఆరోగ్యం దెబ్బతింటోందని రామ్ దూత్ కుటుంబం పలుమార్లు అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ విషయంపై తరచూ గొడవలు జరిగాయి.అదేవిదంగా నిందితుని రామ్ దూత్ తండ్రి, చిన్న నాన్న (బాబాయ్ ) కుటుంబ ఆస్తి తనకే వస్తుందని భావించి బాబాయ్ కుటుంబ సభ్యులను చంపాలని రామ్ దూత్ నిర్ణయించుకొని, గత సంవత్సరం అక్టోబర్ 5న అమెజాన్ ద్వారా కొబ్బరి కత్తి కొనుగోలు చేసి ఇంట్లో దాచుకున్నాడు. హత్యకు గల కారణాలను ఒక నోటు బుక్కులో కూడా రాసుకున్నాడు. నిందితుని పథకం లో భాగంగా శుక్రవారం తెల్లవారుజామున సుమారు ఉదయం 5 గంటల సమయంలో, పిన్ని సుమిత్ర నిద్ర లేచి , తలుపులు తీసి , బాత్రూం కు వెళ్లగా రామ్ దూత్ కత్తితో పక్కింట్లోని బాబాయ్ ఇంటికి వెళ్లి పడుకుని ఉన్న ప్రణయ్పై ఛాతీ, భుజాలు, మెడపై దాడి చేశాడు. అరుపులు విని అడ్డుకున్న కొమురమ్మకు ముఖం, చెవి, చేతిపై గాయాలు అయ్యాయి. తరువాత సుమిత్రిపై కూడా ముఖం, చేతులపై కత్తితో దాడి చేసి తీవ్ర గాయాలు చేశాడు.అరుపులు విని అక్కడికి వచ్చిన చుట్టూ ప్రక్కన వ్యక్తులు నిందితుడిని అడ్డుకుని కత్తి లాక్కొన్నారు. దాడి సమయంలో బట్టలపై రక్తం పడటంతో బట్టలు మార్చుకుని రామ్ దూత్ ఇంటి నుండి పారిపోయాడు. వారిని మొదటగా గోదావరిఖని గవర్నమెంట్ హాస్పిటల్ కు తర్వాత కరీంనగర్ ప్రైవేట్ హాస్పిటల్ కు తీసుకుపోయి అడ్మిట్ చేశారు.నిందితుడు ప్రభుత్వ జూనియర్ కాలేజీ గ్రౌండ్ వద్ద దాక్కొని బస్ స్టాండుకు వెళ్తున్నాడు అనే నమ్మదగిన సమాచారం మేరకు ఇన్స్పెక్టర్ ఇంద్రాసేనా రెడ్డి, అక్కడకి వెళ్లి నిందితుడిని పట్టుకొని అదుపులోకి తీసుకోని పోలీస్ స్టేషన్ తరలించి అరెస్ట్ చేసి కోర్ట్ లో హాజరు పరిచి రిమాండ్ కి తరలించడం జరిగింది అని ఏసీపీ తెలిపారు.

## పుష్కరాల ఏర్పాట్లపై అధికారుల పర్యటన



**చురకలు విలేకరి,ఇబ్రహీంపట్నం,ఫిబ్రవరి 20 :** ఇబ్రహీంపట్నం మండలంలోని ఎర్దండి,మూలరాంపూర్, యామపూర్ గ్రామాల్లో 2027లో జరిగే గోదావరి పుష్కారాల నిర్వహణకు కావాల్సిన ఏర్పాట్లపై అధికారులు శుక్రవారం ఆయా గ్రామాల్లో పర్యటించారు.ఈ సందర్భంగా తహసీల్దార్ వరప్రసాద్, ఎంపిడివో గణేష్,ఎస్ఐ నవీన్లు గ్రామాల్లో పర్యటించి ఏర్పాట్లకు కావాల్సిన వివరాలను పరిశీలించి అంచనాలను తయారు చేశారు.ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, పంచాయితీ కార్యదర్శులు,అధికారులు పాల్గొన్నారు.

## వేములకుర్తిలో ఉచిత పశువైద్య శిబిరం



**చురకలు విలేకరి, ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 20 :** ఇబ్రహీంపట్నం మండలంలోని వేములకుర్తి గ్రామంలో శుక్రవారం పశు గణన అభివృద్ధి సంస్థ, పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డా.శైలజ మాట్లాడుతూ పశువులకు గర్భకోశ వ్యాధి నివారణ చికిత్స చేయిస్తే పశువులు ఆరోగ్యం ఉండి ఎదకు వస్తాయన్నారు.గోపాలమిత్ర జిల్లా సూపర్ వైజర్ నర్సయ్య మాట్లాడుతూ శీతాకాలంలో పశువులు ఎదకు వస్తాయని,ఎదకు వచ్చిన పశువులను కృత్రిమ గర్భధారణ చేయించుకుంటే మేలు రకపు దూడలు జన్మనిస్తాయన్నారు. అనంతరం పశువులకు గర్భకోశ వ్యాధి నివారణ,నట్టల నివారణ మందులు వేశారు.ఈ కార్యక్రమంలో గోపాల మిత్రలు గంగారాం,శ్రీనివాస్,ప్రేమ్,ఉప సర్పంచ్ బర్మా మల్లయ్య,రైతులు పాల్గొన్నారు.

## ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

**చురకలు విలేకరి, జగిత్యాల,ఫిబ్రవరి 20 :** జగిత్యాల పట్టణంలోని ఇస్లాంపురకు చెందిన మహమ్మద్ సాజిద్(41) అనే వ్యక్తి ఆర్థిక ఇబ్బందులతో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని బీట్ బజార్ చౌరస్తా వద్ద నివాసం ఉంటున్న మహమ్మద్ సాజిద్ కొన్ని రోజులగా ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నాడని, శుక్రవారం తెల్లవారుజామున తన నివాసంలో సీలింగ్ ఫ్యాన్కు నైలాన్ తాడుతో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. మృతుడి కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జగిత్యాల పట్టణ ఎస్ఐ కుమారస్వామి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ పి.కరుణాకర్ తెలిపారు.

# కస్తూర్బా పాఠశాలను సందర్శించిన డిఈవో

**-జిల్లా విద్యాధికారి రాము**

**చురకలు విలేకరి, బీర్పూర్, ఫిబ్రవరి 20 :**

బీతీపూర్ మండలంలోని తుంగూరు గ్రామంలో గల కస్తూర్బా గాంధీ పాఠశాలను శుక్రవారం జిల్లా విద్యాధికారి రాము సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ విద్యార్థులందరు పరీక్షలకు సన్నద్ధం కావాలని,శ్రద్ధగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థుల ఉత్తీర్ణతశాతం పెంచేందుకు కృషి చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి సిరుప నాగభూషణం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రత్యేక అభినందనలు

**-కలెక్టర్ కోయ శ్రీ హర్ష**
**-రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించిన జిల్లా కలెక్టర్**



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ (పెద్దపల్లి) ఫిబ్రవరి 20 :** విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి క్రీడా పోటీలలో పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.విద్యాశాఖ ఆధ్వర్యంలో సి.డబ్ల్యూ.ఎస్.ఎన్ విద్యార్థుల కోసం నిర్వహించిన రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన జిల్లా విద్యార్థులను శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో తన చాంబర్ లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అభినందించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, ఫిబ్రవరి 17న హైదరాబాద్ లోని దోమలగూడ లో ప్రభుత్వ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాలలో సి.డబ్ల్యూ.ఎస్.ఎన్ విద్యార్థుల కోసం నిర్వహించిన రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలలో పెద్దపెల్లి జిల్లాకు చెందిన 20 మంది సి.డబ్ల్యూ.ఎస్.ఎన్ విద్యార్థులు వివిధ క్రీడా విభాగాల్లో పాల్గొని ప్రతిభ కనబరిచారని అన్నారు. జూలపల్లి మండలానికి చెందిన బడుగు సందీప్ జిగ్ జాగ్ వాకింగ్ లో 1వ బహుమతి , కమాన్ పూర్ మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎడునూరి పౌర్ణమి చెస్ పోటీలో 1వ బహుమతి, రొంపికుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన కటకం శ్రీరామ్ చరణ్ పరుగుపందెంలో 1వ బహుమతి, మ్యూజికల్ చైర్ లో 2వ బహుమతి, జిగ్‌జాగ్ వాకింగ్ లో 2వ బహుమతి సాధించారు.విజేతలను జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష , జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీమతి శారద ప్రత్యేక అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీమతి జి.శారద, ఐఈ కోఆర్డినేటర్ జి. కవిత సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మేయర్‌కు ఘన సన్మానం



**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ ఫిబ్రవరి 20 :** నూతనంగా ఎన్నికైనటువంటి మేయర్ మహంకాళి స్వామిని కాంగ్రెస్ పార్టీ తెలంగాణ పిసిసి లీగల్ సెల్ కన్వీనర్- హైకోర్టు న్యాయవాది మేడారం సాయి చందు ఘనంగా సన్మానించారు.పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం టి టి ఎస్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ తెలంగాణ పి సి సి లీగల్ సెల్ కన్వీనర్ హైకోర్టు న్యాయవాది మేడారం సాయి చందు రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్, మేయర్ మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్ పాత పెల్లి ఎల్లయ్యను శాలువాలతో సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ పిసిసి లీగల్ సెల్ కన్వీనర్,హైకోర్ట్ బార్ అసోసియేషన్ కల్చరల్ కమిటీ కన్వీనర్ హైకోర్టు న్యాయవాది మేడారం సాయి చందు మాట్లాడుతూ రామగుండం మున్సిపల్ ఎన్నికలలో గెలుపే లక్ష్యంగా అత్యధిక స్థానాలను గెలిపించుకున్న రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తూ, మున్సిపల్ అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నటువంటి రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్ పై నమ్మకంతో ప్రజలు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు ఓటేసి గెలిపించడం జరిగింది. దీనిలో భాగంగానే రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్,నూతనంగా ఎన్నికైనటువంటి మేయర్ మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్ పాత పెల్లి ఎల్లయ్యను శాలువాలతో సన్మానించడం జరిగిందని కాంగ్రెస్ పార్టీ తెలంగాణ పిసిసి లీగల్ సెల్ కన్వీనర్,హైకోర్టు బార్ అసోసియేషన్ కమిటీ సాంస్కృతిక కల్చరల్ సెక్రెటరీ,హైకోర్టు న్యాయవాది మేడారం సాయి చందు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ తెలంగాణ పిసిసి లీగల్ సెల్ కన్వీనర్,నాంపల్లి హైకోర్టుబార అసోసియేషన్ సాంస్కృతిక కల్చరల్ సెక్రెటరీ, హైకోర్టు న్యాయవాది మేడారం సాయి చందు, తాజా మాజీ కౌన్సిలర్లు,కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు అందుబాటులో ఫ్రిడ్జ్

**-ఖాజీ మహమ్మద్ ఇస్మాయిల్ నిజామీ**




**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ ఫిబ్రవరి 20 :** టెమ్రీస్ బాలుర పాఠశాల 1రామగుండం లో కూల్ ఫ్రీ ప్రారంభించారు. విద్యార్థుల సౌకర్యార్థం కూల్ ఫ్రీజర్ ప్రారంభించడం జరిగిందని ఖాజీ మహమ్మద్ నిజామి తెలిపారు.ఈ కార్యక్రమంలో ఖాజీ మొహమ్మద్ ఇస్మాయిల్ నిజామి - టెమ్రీస్ కౌన్సెలర్ - జమాతే ఇస్లామీ హింద్ -రామగుండం కార్పొరేషన్ మండల ఇంచార్జ్ -ముఖ్య అతిథి డ శ్రీమతి ఆయేషా సిద్ధిఖ -గౌరవ అతిథి -టెమ్రీస్ కౌన్సెలర్- ఇస్తెక్‌బాల్ రంజాన్ కార్యక్రమం లో డ్రింకింగ్ వాటర్ ఫ్రీజర్ పై దంపతులు రిబ్బన్ కటింగ్ చెసి ప్రారంబించారు-డాక్టర్ శ్రీధర్ - ప్రిన్సిపాల్,వార్డెన్ ఇస్మాయిల్ సార్,మౌలానా నిజాముద్దీన్ ఇమామ్ వోహ్ ఖతీబ్- మసీదు రామగుండం బాలుర పాఠశాల 1- బోధన సిబ్బంది, బోధనేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

# సర్పంచ్‌ను సన్మానించిన ఎమ్మెల్యే

**చురకలు విలేకరి,బీర్పూర్,ఫిబ్రవరి 20 :** జగిత్యాల పట్టణంలో శుక్రవారం జరిగిన సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా రంగాసాగర్ గ్రామ సర్పంచ్ బోడ సాగర్ మండల సర్పంచుల ఫోరం ఉపాధ్యక్షునిగా ఎన్నిక కావడం పట్ల ఆయనను జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సంత్ సేవాలాల్ జయంతి కమిటి సభ్యులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



## వివాహ వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ ఫిబ్రవరి 20 :** ముత్తారం మండల కాంగ్రెస్ నాయకులు శుక్రవారం జరిగిన పెళ్లి వేడుకల్లో పాల్గొన్నారు. ముత్తారం మండలం రామకృష్ణపూర్‌గ్రామసర్పంచ్ తాని ప్రభాకర్‌కుమారుడు ప్రవీణ్-అక్షయ వివాహానికి వేడుకల్లో పాల్గొని నూతనవధూవరుల ఆశీర్వదించారు.ఈ వేడుకల్లో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు మాజీ జడ్పీటీసీ చొప్పరి సదానందం,ముత్తారాం మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు దొడ్డ బాలాజీ,ఎక్స్ జడ్పీటీసీ నాగినేని జగన్మోహన్ రావు,మంథని మండల అధ్యక్షులు ఐలి ప్రసాద్,జిల్లా సోషల్ మీడియా ఇంచార్జి అరెల్లి కిరణ్,పారుపల్లి సర్పంచ్ చొప్పరి సంపత్ పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో వారివెంట కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి విరాళం ఇచ్చిన సర్పంచ్



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట ఫిబ్రవరి 20 :** ఎల్లారెడ్డిపేట మండలం పదిర గ్రామంలో నూతనంగా గౌడ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న శ్రీ రేణుక ఎల్లమ్మతల్లి ఆలయానికి శుక్రవారం ఫదిర సర్పంచ్ బోనాల మణెమ్మ తన కుమారుడు సాయి కలిసి 100000రూపాయల నగదును విరాళంగా ఆలయ కమిటీ ప్రతినిధులకు అందజేసి పలువురికి ఆదర్శంగా నిలిచారు.ఈ సందర్భంగా పదిర సర్పంచ్ బోనాల మణెమ్మ తన కుమారుడు బోనాల సాయిల్‌ను గౌడ సంఘం సభ్యులు అభినందించారు.ఈ కార్యక్రమంలో బిజెపి పార్టీ నాయకులు మద్దుల బుగ్గారెడ్డి,రామచంద్రారెడ్డి,కుంటా రెడ్డి బోడ ఎల్లయ్య కోల రంగయ్య గౌడ్ వెంకటస్వామిగౌడ్ తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్,మల్లేశంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎండపల్లిలో అగ్నిప్రమాదం

**-ఫైర్ సిబ్బంది సమయస్ఫూర్తితో తప్పిన ప్రమాదం**



**చురకలు విలేకరి, ఎండపల్లి, ఫిబ్రవరి 20 :** మండల కేంద్రంలోని బాలుర వసతి గృహం సమీపం వద్ద ఉన్న భారీ చింత చెట్టుకు ప్రమాదవశాత్తు మంటలు అంటుకుని పూర్తిగా కాలిపోయింది. మంటలు పక్కనే ఉన్న ఇంటి వైపు వ్యాపించడంతో స్థానికులు అప్రమత్తమై వెంటనే ఫైర్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది తక్షణమే సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. సమయానికి ఫైర్ ఇంజన్ చేరుకోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు.


# భక్తుల సౌకర్యార్థం దాతలు ముందుకు రావడం అభినందనీయం

**-గ్రామ సర్పంచ్ ముస్కుల నరేందర్ రెడ్డి**

**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ ఫిబ్రవరి 20 :** రామగిరి మండలం సుందిల్ల గ్రామంలో ప్రముఖ పుణ్య క్షేత్రం అయిన శ్రీ లక్ష్మీ నృసింహా స్వామి దేవాలయంలో శుక్రవారం రోజున గ్రామ ఆదర్శ దంపతులైన అనంతుల రాజేశ్వరి,లక్ష్మయ్యలు సుందిల్ల గ్రామం లోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానానికి ఆర్.ఓ.నీటిశుద్ధి యంత్రాన్ని భక్తిపూర్వకంగా విరాళంగా సమర్పించారు.ఆర్.ఓ.ప్లాంటును సుందిల్ల గ్రామ సర్పంచ్ ముస్కుల నరేందర్‌రెడ్డి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ముస్కుల నరేందర్ రెడ్డి,ఉప సర్పంచ్ జనగామ సదానందం,వార్డు సభ్యులు విజయగిరీ సదాశివ చారి,రామగిరి స్టాలిన్ లు మాట్లాడుతూ..భక్తుల సౌకర్యార్థం నీటి శుద్ధి యంత్రాన్ని ఏర్పాటు చేయడం



అభినందనియమని,ఆదర్శ దంపతులను శాలువాలతో సత్కరించారు.లక్ష్మీ నృసింహా స్వామి దేవాలయ అతి సమీపాన ఉన్న శ్రీ రాజరాజేశ్వర ఆలయాన్ని,మల్లిఖార్జున స్వామి ఆలయాన్ని మరింత అభివృద్ధి చేస్తామని శివాలయ,మల్లిఖార్జునస్వామి ఆలయాల అభివృద్ధికి దాతలు,భక్తులు ముందుకు రావాలని ఆలయాలు అభివృద్ధి చెందితే ఆదాయం పెరుగుతుందని దానిద్వారా గ్రామం అభివృద్ధి చెందుతుందని,చిరు వ్యాపారస్తులకు ఉపాధి దొరుకుతుందని అన్నారు.ఆలయ ఈఓ రాజ్‌కుమార్ మాట్లాడుతూ దినదినాభివృద్ధి అభివృద్ధి చెందుతున్న ఆలయానికి దాతలు ముందుకు రావడం,గ్రామ అభివృద్ధితో పాటు దేవాలయాల అభివృద్ధిపై సర్పంచ్ నరేందర్ రెడ్డి చొరవ మర్చిపోలేనిది అన్నారు.ఆలయ చైర్మన్ మాట్లాడుతూ ఐటీ శాఖమంత్రి శ్రీధర్‌బాబు, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ ల చొరవతో ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈఓ రాజ్ కుమార్, దేవ స్థానం చైర్మన్ కోరకొప్పుల సత్యం గౌడ్,కాంగ్రెస్ వార్డు సభ్యులు,సీనియర్ నాయకులు గర్రేపల్లి ప్రవీణ్ గౌడ్, అనంతుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



# ప్రతి వర్గానికి సమానహక్కులు, అవకాశాలు న్యాయం అందించాలి

**-లోక్ అదాలత్ సభ్యులు ఆడెపు వేణు**

**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట ఫిబ్రవరి 20 :** సమాజంలోని ప్రతి వర్గానికి సమాన హక్కులు,అవకాశాలు న్యాయం అందించాల్సిన అవసరం ఉందని లోక్ అదాలత్ సభ్యులు, న్యాయవాది ఆడెపు వేణు అన్నారు. జిల్లా న్యాయ సేవాధికర సంస్థ ఆధ్వర్యంలో జిల్లా న్యాయ సేవాధికర సంస్థ అధ్యక్షురాలు,జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీమతి పి.నీరజ ఆదేశాలతో సీనియర్ సివిల్ జడ్జి/ కార్యదర్శి,డిఎల్ఎస్ఎ పి.లక్ష్మణా చారి సమన్వయంతో శుక్రవారం తంగళ్లపల్లి మండలంలోని తెలంగాణ ట్రైబల్



వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజీ (మహిళ),సిరిసిల్లలో రాజనీతి శాస్త్ర విభాగం సహకారంతో ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవంను పురస్కరించుకొని న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 20న ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవంను జరుపుకుంటామని, సమానత్వం, సమగ్ర అభివృద్ధి, మానవ హక్కుల పరిరక్షణ మరియు సామాజిక న్యాయం సాధన లక్ష్యంగా ఈ దినోత్సవాన్ని ఆచరిస్తున్నామని తెలిపారు. పేదలు, మహిళలు,పిల్లలు,దివ్యాంగులు వెనుకబడిన వర్గాలకు న్యాయ సహాయం,విద్య,ఉపాధి అవకాశాలు అందేలా చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు.సామాజిక న్యాయం అనేది కేవలం చట్టపరమైన హక్కుల పరిమితిలో కాకుండా,ఆర్థిక,సామాజిక మరియు రాజకీయ రంగాలలో సమాన అవకాశాలు కల్పించడంలో కూడా ప్రతిఫలించాలని అన్నారు.ఈ సదస్సులో అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శ్రీమతి.ఈ.జ్యోతి,న్యాయ వాదులు గుర్రం ఆంజనేయులు, కడగండ్ల తిరుపతి,అరుణ,రాజనీతి శాస్త్ర విభాగ అధ్యాపకురాలు శ్రీమతి.నవ్యశ్రీ విద్యార్థినిలు పాల్గొన్నారు.

# ఆపరేషన్‌ను విజయవంతం చేసిన వైద్యులు

**-సూపరింటెండెంట్ కె. శ్రీధర్**

**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ ఫిబ్రవరి 21 :** మహిళకు క్లిష్టమైన ఆపరేషన్ చేసి విజయవంతం చేశారని పెద్దపల్లి వైద్యశాల సూపర్డెంట్ డాక్టర్ కే. శ్రీధర్ తెలిపారు.పెద్దపల్లి పట్టణానికి చెందిన 33 సంవత్సరాల ఒక మహిళ తీవ్రమైన కడుపు నొప్పితో పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి రావడం జరిగింది. గైనకాలజిస్ట్ డాక్టర్ రవళిక సదరు పేషెంట్‌కు పరీక్షలు జరపగా పేషెంట్‌కు ఎడమ వైపు అండాశయం లో దేర్మయుడు సిస్ట్ ఉందని గుర్తించి వెంటనే ఆ మహిళకు అధునాతన పద్ధతిలో డాక్టర్ అమర సింహా రెడ్డి, లాప్రోస్కోప్ సర్జన్ తో లాప్రోస్కోప్ పద్ధతిలో అత్యవసర శస్త్ర చికిత్స చేసి ఆ సిస్ట్ ను తీసివేయడం జరిగింది.ఈ



ఆపరేషన్ లో పాల్గొన్న వైద్య బృందం డాక్టర్ అమరసింహ రెడ్డి, డాక్టర్ సాయి ప్రసాద్, డాక్టర్ రవళిక మరియు డాక్టర్ స్వాతి.ఈ సర్జరీ చేసిన వైద్య బృందాన్ని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. శ్రీధర్ ప్రత్యేకంగా అభినందించడం జరిగింది.అదేవిధంగా ప్రజలందరూ పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో అందుతున్న నవజాత శిశు కేంద్రం సేవలు,2డి ఎకో సేవలు,ఆధునిక పరిజ్ఞానంతో కూడిన లాప్రోస్కోపిక్ శస్త్ర చికిత్సలు,యూరాలజీ సేవలు మరియు రూట్ కెనాల్ సేవలను,కంటి శస్త్ర చికిత్సలు,ఫిజియోథెరపీ సేవలు ప్రసూతి సేవలు హిస్టరెక్టమీ సేవలు,ఆర్థో సేవలు ఉపయోగించుకోవాలని,మరియు ఈ సేవలలో ఏవైనా ఇబ్బందులు ఎదురైనచో నేరుగా సూపరింటెండెంట్ ని కలవచ్చు అని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు

# తపస్ ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్ పర్సన్ సన్మానం




**చురకలు ప్రతినిధి జగిత్యాల,ఫిబ్రవరి 20 :** నూతనంగా ఎన్నికైన జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్‌ను గురువారం తపస్ ఉపాధ్యాయ సంఘనేతలు,ఉపాధ్యాయులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్పర్సన్ వాణి మాట్లాడుతూ పాఠశాల మౌలిక వసతుల కల్పనకు తన వంతు కృషి చేస్తానని ఉపాధ్యాయుల కృషితో జగిత్యాల జిల్లా 10వ తరగతి ఫలితాలలో రాష్ట్రస్థాయిలో మొదటి స్థానంలో ఉండాలని కోరారు.ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లానని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బోయినపల్లి ప్రసాదరావు,కొక్కుల రాజేష్, తపస్ రాష్ట్ర అధ్యక్షుడు వీ రాజశేఖర్, ఆయిల్నేని నరేందర్ రావు,బి దేవయ్య మలహర్రావు,జిల్లా ఆర్థిక కార్యదర్శి నాగమల్ల రమేష్,జిల్లా ఉపాధ్యక్షులు జొన్నల పూర్ణచందర్,కొండూరి రజినీకాంత్, రఘునందన్,జి రామకృష్ణ, గంగారెడ్డి,తుల సంజీవరావు, గంగారెడ్డి, ప్రదీప్, ప్రవీణ్ రావు,కాళిదాస్, దువ్వ రవీందర్, గంప కిరణ్,కొక్కుల రమేష్, తిరుమల్ రెడ్డి, రాజేందర్,సురేష్, రాజేశ్వర్, రవి, అశోక్,డి శ్రీనివాస్, కృష్ణారెడ్డి,రవి, పిడుగు భాస్కర్, చుక్క కిరణ్, ఠాకూర్ బాలాజీ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# వాహనాలను ధ్వంసం చేసిన దుండగులు




**చురకలు విలేకరి,ధర్మపురి,ఫిబ్రవరి 20 :** ధర్మపురి మున్సిపల్ చైర్ పర్సన్ గా ఎన్నికైన నాగలక్ష్మి రాజేష్ లకు సంబంధించిన రెండు బొలెరో ట్రాన్స్పోర్ట్ వాహనాలపై గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. అంతటి ఆగకుండా టైర్లలోని గాలిని తీసివేశారు.ప్రతినిత్యంలాగే వారి ఇంటి ముందు రోడ్డు అవతల పార్కింగ్ చేశారు.గురువారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు రెండు వాహనాల ముందు అద్దాలు పగల గొట్టారు.చైర్పర్సన్ భర్త వేముల రాజేష్ ఫిర్యాదుతో పోలీసులు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# సిల్వర్ మెడల్ సాధించిన కమాన్ పూర్ పోలీస్



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ ఫిబ్రవరి 21 :** కమాన్‌పూర్ పోలీస్ స్టేషన్లో కానిస్టేబుల్ గా పనిచేస్తున్న మట్ట రమేష్ పోలీస్ క్రీడల్లో సిల్వర్ మెడల్ సాధించారు.అలాగే టీం విభాగంలో బ్రాంజ్ మెడల్ సాధించాడు.శుక్రవారం సైబరాబాద్ కమిషనరేట్ లో జరుగుతున్న నాల్గవ తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ ఉ గేమ్స్ లో భాగంగా ఆర్చరీ పోటీల్లో వ్యక్తిగత విభాగంలో సిల్వర్ మెడల్ మరియు టీం లో బ్రాంజ్ మెడల్ ను సాధించారు. ఆయన సిల్వర్ సాధించడం పట్ల ఎస్సై కొట్టె ప్రసాద్, ఏ ఎస్ ఐ లు బాలాజీ నాయక్ ,రహీం ,ఖలీల్ ఖాన్, సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ బాపన్న, మరియు మల్లయ్య, జంగిలి రమేష్, శ్రీనివాస్, శ్రీలత, జాహ్నవి, రమ్మీ జ్, శ్రీనాథ్ తదితరులు శుభాకాంక్షలు తెలియజేశారు.

# హలీం రుచికి సలాం




- 1956లో ప్రారంభమైన ప్రస్థానం
- తొలిదశలో పోస్టు కార్డులతో ప్రచారం
- నేడు గల్లీ నుంచి రెస్టారెంట్ల వరకు విక్రయాలు
- నగరంలో రంజాన్ రుచుల సందడి
- 20 సెంటర్లలో నిత్యం 5 క్వింటాళ్ల తయారీ












**చురకలు ప్రతినిధి,కరీంనగర్, ఫిబ్రవరి 20 :** హలీం.. రంజాన్ మాసం లో లభించే అరుదై వంటకం. ముస్లింల సంప్ర అన్ని మతాలవారు ఇష్టంగా తినడంతో ప్రాచుర్యం పొందింది. కులమతాలకు అతీతంగా ప్రజలం దరూ ఇష్టపడే హలీంకు ఒకప్పుడు హైదరాబాద్ కేం ద్రంగా ఉండేది. మారుతున్న కాలానికి అనుగుణంగా ఉమ్మడి కరీంనగర్ నగరం తో పాటు ఉమ్మడి జిల్లాలోని సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల జిల్లా కేంద్రాల్లోనూ హైదరాబాద్ రుచిని మైమరిపించేలా హలీం కేంద్రాలు వెలుస్తున్నాయి.

**ఇలా తయారు చేస్తారు..**

గోధుమ రవ్వ, నెయ్యి, మటన్ (బోన్లెస్), పుట్నాల పప్పు (తినే శెనగ పప్పు), గరం మసాలా, ఉల్లిపాయలు, కొత్తిమీర, పుదీనాతో తయారు చేస్తారు. లేత పొట్టేలు మాంసం అయితే రుచి బాగా ఉంటుంది. మాంసాన్ని పెద్ద మందపాటి పాత్రలో 5 గంటల పాటు ఉడికిస్తారు. గోధుమ రవ్వ, పుట్నాల పొడి, గరం మసాల వేసి బాగా కలిపి మరో 4 గంటల పాటు సన్నటి సెగపై (అడుగు అంటకుండా) ఉడికిస్తారు. బాగా మెత్తగా ఉడికిన తర్వాత ఈ మిశ్రమానికి నెయ్యి కలిపి మెత్తగా కలిసిపోయే వరకూ పొడవైన కర్రలతో రుబ్బుతారు.



ఇరాన్ కు చెందిన హుస్సేన్ జాబిత్ 1947లో హైద రాబాద్లోని మదీనా సర్కిల్లో హోటల్ ప్రారంభిం చి హలీం విక్రయాలు ప్రారంభించాడు. తర్వాత కాలంలో 1956లో రంజాన్ మాసం ప్రారంభమైన తొలిరోజు హలీం పేరుతో కొత్త వంటకాన్ని తయారు చేసి 25 పైసలకు ఒక పాత్రలో ఇవ్వడంతో దీని ప్రస్థానం ప్రారంభమైంది. తొలిరోజుల్లో అంత గా ఆదరణ లభించకపోవడంతో బిర్యానీకి హలీం ఫ్రీ అని ప్రకటించారు. తర్వాత సంవత్సరం హలీం విశిష్టతను తెలియజేస్తు పోస్టుకార్డులతో ప్రచారం నిర్వహించారు. టెలిఫోన్ డైరెక్టరీ ఆధారంగా అందు లో ఉన్న అడ్రస్లకు పోస్టుకార్డులు రాశారు. దీంతో కొంత మేర విక్రయాలు పెరిగాయి. 1956-1960 వరకు పోస్టుకార్డులు, పత్రిక ప్రకటనలు, పోస్టర్లు తదితర మార్గాల్లో హుస్సేన్ ప్రచారం నిర్వహించగా ఆయన ప్రయత్నం ఫలించింది. 1961 నుంచి హలీంకు డిమాండ్ పెరిగింది. అప్పటి నుంచి 1998 వరకు మదీనా



హోటల్లో హలీం విక్రయాలు జరిగాయి. అదే సంవత్సరం హుస్సేన్ మరణిం చాడు.

**కరీంనగర్ సిటీలో 5క్వింటాళ్ల హలీం**

కరీంనగర్ నగరవ్యాప్తంగా 20 హలీం సెంటర్లు ఉన్నాయి. వాటిలో రోజూ 5 క్వింటాళ్ల హలీం తయారు చేస్తుండగా విక్రయాలతో రోజూ రూ.22లక్షల నుంచి రూ.25 లక్షల వరకు బిజినెస్ జరుగు తోంది. హలీం అమ్మకాలకు తోడు ఇతర ప్రత్యేక వంటకాల ద్వారా మరో రూ.5 లక్షల వ్యాపారం జరుగుతోంది. హలీం తయారీకి 3 క్వింటాళ్ల మేక మాసం ఉపయోగిస్తుండగా హరీస్ తయారీ కోసం క్వింటాల్ కోడి మాంసం అవసరం అవుతుంది. రోజూ ఒక్కో హలీం సెంటర్ లో 15 నుంచి 50కిలోల హలీం, 5 నుంచి 20 కిలోల వరకు హరీసు తయారు చేస్తారు. పెద్దపల్లి జిల్లా వ్యాప్యంగా 20 హలీం సెంటర్లు ఉండాగా వాటిలో అధిక భాగం గోదావరిఖనిలో ఉన్నాయి. రోజూ రెండు క్వింటాళ్ల హరీస్ విక్రయాలు జరుగుతుండగా, 500 కిలోల హలీం అమ్మకాలు సాగుతాయి. రాజన్న సిరిసిల్ల జిల్లా పరిధిలో సిరిసిల్లలో రెండు, వేములవాడలో రెండు హలీం కేంద్రాలున్నాయి. నాలుగు కేంద్రాల్లో మొత్తం 60 కిలోల హరీస్, 20కిలోల హలీం అమ్మ కాలు జరుగుతాయి. ఇక జగిత్యాల జిల్లా పరిధిలో మొత్తం 20 హలీం సెంటర్లు ఉండగా అత్యధికంగా జగిత్యాల జిల్లా కేంద్రంలోనే ఉన్నాయి. ఈ సెంటర్ల లో మొత్తం 10 క్వింటాళ్ల హరీస్ అమ్మకాలు జరుగుతాయి.



**20 ఏళ్లుగా అమ్మకాలు..**

గత 20 సంవత్సరాలుగా మహేక్ క్యాటరింగ్ సెంటర్ ద్వారా హలీమ్, హరీష్, బిర్యానీ, అరేబియన్ వం టకాలను కరీంనగర్ నగర వాసులకు రుచి చూపిస్తు న్నాం. హలీం తయారీలో ఇరానీ పద్దతులు పాటిస్తునే కరీంనగర్ నగరవాసుల ఆహార అలవాట్లకు అనుగు ణంగా నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ, స్వచ్ఛమైన మసాలా దినుసులు ఉపయోగించి తయారు చేయడం ఆయన ప్రత్యేకత -

బాబా పటేల్, మహేక్ క్యాటరింగ్..కింగ్స్ హలీం సెంటర్, ఐబీ రోడ్ హోటల్ మానేరు ఎదురుగా కరీంనగర్

**ప్రేమాభిమానాలు ముఖ్యం..**

ఉపవాస దీక్షల వల్ల ఆకలి బాధ తెలిసి పేద వాడికి కూడా సాయం చేయాలనే ఉద్దేశం కలుగుతుంది. పండుగా రోజు మతాలతో సం బంధం లేకుండా స్నేహితులను ఇంటికి ఆహ్వానిస్తాం. హలీంతోపాటు తీపితో కూడిన పాయసం తినిపిస్తాం. అందరి మనసుల్ని తీపి చేస్తూ అందరూ ప్రేమాభిమానాలతో జీవిం చాలని కోరుకుంటాం.

**- సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్**

**ఎంఐఎం కరీంనగర్ అధ్యక్షుడు**

